# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 276
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఆగస్టు 07, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సహకరించాలి

- పార్లమెంట్ లో ప్రశ్నించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య






2లో..

- వారికే నామినేటెడ్ పోస్టులు
- కొత్తగా వచ్చినోళ్లకు పదవులు కష్టమే
- మీనాక్షి నటరాజన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం
- బీఆర్ఎస్ చేసిన తప్పనే కాంగ్రెస్ చేయొద్దని నిర్ణయం
- ప్రక్షాళన దిశగా అడుగులు





వివరాలు 2లో..

# పాతోళ్లకే పదవులు

గతంలో ఏ పార్టీ చూసినా కష్టపడేటోడు ఒకడైతే.. అనుభవించేవాడు మరొకడు అన్న చందంగా ఉండేది. జంపింగ్ జిలానీలకే పెద్దపీట వేయడంతో నిజమైన నేతలు, కార్యకర్తలను చులకనగా చూసేవారు. జీవిత కాలం ఒకే పార్టీని నమ్ముకొన్నవారికి అడుగడుగునా అన్యాయమే జరిగేది. ఫ్లైట్ మోడ్ లో వచ్చిన వారికే పదవులు దక్కడం ఆనవాయితీగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీ నేతల బెదిరింపులకు, పోలీస్ కేసులకు తట్టుకొని పార్టీకోసం ఉన్నదంతా అమ్ముకున్న వారిని పట్టించుకునేవారే కరువయ్యారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. పార్టీ రాష్ట్ర ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్, పార్టీ స్వరూపాన్నే మార్చేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నేతలకే ప్రాధాన్యం ఇవ్వడంతో పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో అసంతృప్తి పెరిగి, చివరికి అధికారాన్ని కోల్పోయిన విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించింది. తమ పార్టీకి కూడా అదే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో మీనాక్షి నటరాజన్ పలు కీలక మార్పులకు ఉపక్రమించారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి



8లో..

## రేపే డబుల్ బెడ్ రూంల పంపిణీ

- హాజరుకానున్న ఇంచార్జి మంత్రి పొంగులేటి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్



2లో..

## పోతన విజ్ఞాన పీఠంలో.. సకల కళల సంబరాల జాతర-2025

- సదానందంను అభినందించిన కేయూ వీసీ, రిజిస్ట్రార్



8లో..

నిజమైన అందాన్నిచ్చేది

## చేనేత వస్త్రాలే

- లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్
- ఓరుగల్లులో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం




# పాతోళ్లకే పదవులు

- వారికే నామినేటెడ్ పోస్టులు
- కొత్తగా వచ్చినోళ్లకు పదవులు కష్టమే
- మీనాక్షి నటరాజన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం
- బీఆర్ఎస్ చేసిన తప్పునే కాంగ్రెస్ చేయొద్దని నిర్ణయం
- ప్రక్షాళన దిశగా అడుగులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** తెలంగాణలో అధికారం చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మరింత పటిష్టంగా ముందుకు సాగుతోంది. పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు పాత నేతలకు ప్రయారిటీ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ వ్యూహం అందరినీ సంతృప్తి పరిచే విధంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జిగా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్ పార్టీ ప్రక్షాళనకు నడుం భిగించారు. పార్టీ శ్రేణులను మూడు గ్రూపులుగా వర్గీకరించారు. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి అండగా ఉన్నవారు.. ఎన్నికల ముందు చేరినవారు.. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ లో చేరినవారు. ఇలా మూడు క్యాటగిరీలుగా వర్గీకరించి మొదటినుంచి పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు, తగిన ప్రాధాన్యం లభించేలా చూస్తున్నారు. దీంతో పాత నేతలు, కార్యకర్తలకు పార్టీలో వారి సేవలకు తగిన గౌరవం దక్కనుంది.

### పాతకే ప్రాధాన్యం..

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 20 నెలలు కావస్తున్నా, మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నిఖార్సైన నేతలకు ఇంకా గుర్తింపు లభించలేదన్న భావన వ్యక్తమవుతోంది. ఎంతో మంది నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నా దక్కలేదని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా ఉన్న తమకు పదవులు అందని ద్రాక్షలా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పాత నేతలకు పదవులు దక్కకపోవడానికి ప్రధాన కారణం, అధికారం చేపట్టిన తర్వాత ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లో చేరిన కొత్త నేతల నుంచి పోటీ పెరగడమే కారణమన్న భావన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని జీర్ణించుకోలేని పాత నేతలు బహిరంగంగానే పార్టీ తీరుపై విమర్శలు





చేస్తున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి కొత్త సమస్యగా మారాయి. ఈ అసంతృప్తి నుంచి పార్టీని గట్టెంక్కించేందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఒక కొత్త వ్యూహాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో పాత నేతలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా పాత నేతల ఆగ్రహాన్ని చల్లార్చవచ్చని ఆమె భావిస్తున్నారు.

### వారి ఆశలకు గండి..

పదవులకోసమే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి నిరాశ తప్పడంలేదు. పార్టీలోకి వలసలను ప్రోత్సహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఈ పరిణామాలు మింగుడు పడటం లేదు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్ తీసుకున్న ఒక నిర్ణయం ఈ పరిస్థితికి కారణమైంది. పాత నేతలు, ఎన్నికల ముందు చేరినవారు, ప్రభుత్వం ఏర్పడ్డాక చేరినవారు అంటూ మూడు క్యాటగిరీలుగా విభజించారు. ఈ వర్గీకరణ ప్రకారం, నామినేటెడ్ పదవుల కేటాయింపులో మొదటి గ్రూపులోని పాత నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంతో పదవులకోసమే పార్టీ మారిన నేతల పరిస్థితి 'రెంటికి చెడ్డ రేవడి' లా తయారైంది. వారు అటు తమ పాత పార్టీలోకి పోలేక, ఇటు కొత్త పార్టీలో తగిన ప్రాధాన్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత రాజకీయాలకు దారి తీస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఎలాంటి మార్పులు తెస్తాయో..?

పార్టీ నియమాలను ఉల్లంఘించిన వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకోవడానికి మీనాక్షి నటరాజన్ సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా పదవుల కేటాయింపులో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన పాత నేతలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చేలా ఒక బలమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ సందేశం ఇప్పటికే పార్టీ శ్రేణులకు చేరింది. ఈ నిర్ణయంతో వలస నేతల ఆశలకు గండి పడినట్లు కాగా, పార్టీలో ఎప్పటినుంచో పనిచేస్తున్న నేతలకు గొప్ప ఊరటనిచ్చింది. మీనాక్షి నటరాజన్ తీసుకున్న ఈ నిర్ణయాలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తాయో వేచి చూడాల్సిందే.

# పోతన విజ్ఞాన పీఠంలో.. సకల కళల సంబరాల జాతర-2025

- సదానందంను అభినందించిన కేయూ వీసీ, రిజిస్ట్రార్

**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణా బాషా, సాంస్కృతిక శాఖ, వరంగల్ జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ అధ్వర్యంలో తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ అఫ్ రికార్డ్స్ కొరకు వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో గురువారం నిర్వహించిన 'సకల కళల సంబరాల జాతర –2025' లో పాల్గొని గౌరవ ప్రశంస పత్రాన్ని పొందిన కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పేషి ఆఫీస్ సబార్డినేట్ మోతే సదానందంను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అభినందించారు. ఉద్యోగుల్లో ఉన్న ఆసక్తి, వారి పని ఉత్పాదకతలో మరింత దోహదపడుతుందన్నారు. బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు మోతే సదానందంను అభినందించారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ విభాగ పరిశోధకురాలు రమాదేవి.డి కి విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువరు డాక్టర్ రమాదేవి.డి ని అభినందించారు. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ మంథని శంకర్ ప్రతిష్టాత్మకమైన డాక్టర్ సి. నారాయణ రెడ్డి సాహిత్య పురస్కారం పొందడంపై పలువురు అభినందనలు తెలిపారు. కేయూ బోధనేతర మహిళా ఉద్యోగినులు డాక్టర్ ఎస్. సుజాత, బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో గురువారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ముందస్తు రక్షాబంధన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ హబీబుద్దీన్ లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ రిజిస్ట్రార్ ఆర్.శ్రీలతాదేవి, సూపరింటెండెంట్‌లు హేమా రాణి, పి.నర్మద, ఎస్.పద్మావతి, ఇతర విభాగాల మహిళా సిబ్బంది పాల్గొన్నారు. తమతో పని చేసే పురుష ఉద్యోగులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంచారు. డిప్యూటీ రిజిస్ట్రార్ పి.శ్రీధర్, సహాయ రిజిస్ట్రార్‌లు డాక్టర్ కోలా శంకర్, డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సహకరించాలి

- పార్లమెంట్ లో ప్రశ్నించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** తెలంగాణలో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) ల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. తెలంగాణ ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, తీసుకుంటున్న చర్యలపై లోక్‌సభలో ఆమె ప్రశ్నించారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే వివిధ పథకాల ద్వారా తెలంగాణ ఎంఎస్ఎంఈలకు అందుతున్న మద్దతును వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు చిన్న పరిశ్రమలు, యంత్రాలు కొనుగోలు చేసేందుకు గరిష్టంగా రూ.25 లక్షల వరకు 40 శాతం సబ్సిడీ అందేలా ఎన్ఎస్ఎస్ హెచ్ పథకం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టుకునే వారికి 25–35 శాతం సబ్సిడీ, పట్టణాల్లో 15–25 శాతం సబ్సిడీ అందేలా పీఎంఈజీపీ పథకం ఉంది. ఎస్సీ, ఎస్టీ మహిళలకు మరింత ప్రయోజనం ఉందని తెలిపారు. హస్తకళల ఉత్పత్తులు చేసే వారికి విదేశీ ప్రదర్శనల్లో పాల్గొనడానికి సహాయం, రిజిస్ట్రేషన్, సర్టిఫికేషన్ ఖర్చులను సైతం బరిస్తున్న ఐసీ పథకం ఉందని పేర్కొన్నారు. జాతీయ హస్తకళల అభివృద్ధి పథకం (ఎన్ హెచ్ డీపీ) ద్వారా తెలంగాణ కళాకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమోషన్ లభిస్తోందని వివరించారు. అంతేకాకుండా డిజిటల్ మార్కెటింగ్ కోసం టీమ్, పీఎంఎస్, ఎంఎస్ఎంఈ గ్లోబల్ మార్కెట్ వంటి పథకాల ద్వారా ఎంఎస్ఎంఈలు, ఓఎన్డీసీలు, eKhandIndia.com వంటి ఈ–కామర్స్ సైట్‌లపై ఉత్పత్తులు అమ్మే అవకాశం కల్పించామన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, ఆగస్టు 07, 2025

# నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

◆ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేనేత పరిశ్రమ సంక్షోభానికి పాలకులు అనుసరిస్తున్న పెట్టుబడిదారీ విధానాలే కారణమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వరంగల్‌లోని కొత్తవాడలో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ పాలకులు ఒకప్పుడు మన చేనేతను ధ్వంసం చేస్తే, నేటి స్వదేశీ పాలకులు కార్పొరేట్ మిల్లు యజమానులకు తొత్తులుగా మారి చేనేతను నిర్లక్ష్యం చేస్తున్నారని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కోట్లాది చేనేత కార్మికులు అప్పులు, అనారోగ్యం, పేదరికంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కోసం రిజర్వ్ చేసిన వస్త్రాలను మిల్లులలో ఉత్పత్తి చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే నాథుడే లేడని ఆయన ఆరోపించారు. చేనేత అభివృద్ధి కోసం చర్చించాల్సిన 'ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు'ను రద్దు చేయడం, చేనేతపై జీఎస్టీ విధించడం, అనేక పథకాలను రద్దు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం చేనేతలకు ద్రోహం చేసిందని వెంకట్రాములు అన్నారు. ఏడాదికి ఒక రోజు చేనేత దినోత్సవం జరిపి చేతులు దులుపుకుంటే సరిపోదని, చేనేత అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ఇంకా అమలు కాలేదని ఆయన గుర్తు చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ పెంచాలని, చేనేత పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో లింగబత్తిని శంకర్, వావిలాల సారంగపాణి, బాసబత్తిని శంకరయ్య, రామకృష్ణ, కళ్యాణపు శేఖర్, దాసుకృష్ణ, కందకట్ల నరసింహరాములు, పెండ్యాల రాజేంద్ర చారి, ఈగ మొగిలి, దొంతుల శంకరయ్య, రమా పుణ్యవతి, రాధ, రమ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ




**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండలంలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు టి. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 120 మంది విద్యార్థులకు సుమారు రూ. 50,000/- విలువైన బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ సొప్పరి సోమయ్య మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని తమ క్లబ్ చేపట్టిందని తెలిపారు. క్లబ్ సెక్రటరీ వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కేవలం ఉద్యోగాలు వెతుక్కోకుండా, ఇతరులకు ఉపాధి కల్పించే పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్ పిన్నింటి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రామనాథం, అశోక్, తిరునగరి సూరి, ఆదిలక్ష్మి, సుమలత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవి ఆద్యను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు నాయిని, కడియం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి మనువరాలు (కూతురి కుమార్తె) చిరంజీవి నామిరెడ్డి ఆద్య నూతన ఫలపుష్ప వస్త్రాలంకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఈ వేడుకలో పాల్గొని ఆద్యను ఆశీర్వదించారు. వీరితో పాటు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి గారు మరియు పలువురు నాయకులు కూడా హాజరయ్యారు.

## విద్యుత్ అధికారుల 'పొలం బాట'



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల సెక్షన్ పరిధిలోని ఆరెపల్లి గ్రామంలో గురువారం నాడు విద్యుత్ అధికారులు 'పొలం బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకోవడానికి, వారికి అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రూరల్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బి.సౌమ్య నాయక్, పరకాల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ జె.దేవేందర్ నాయక్, శాయంపేట అసిస్టెంట్ ఇంజినీర్ బి.చందూలాల్, శాయంపేట సబ్ ఇంజినీర్ మాసు చొక్కా రావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. వీరిలో లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, లైన్‌మెన్ సామ్లె, ఏఎల్‌ఎంలు విష్ణు, సాగర్, శ్రీకాంత్, అన్‌మ్యాన్‌లు రాజు, మహేందర్, రైతులు కూడా పాల్గొన్నారు.

# మొక్కజొన్నలో 'కత్తెర పురుగు' బెడద

◆ నివారణకు రైతులకు అధికారుల సలహాలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి గ్రామంలోని మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు గోపు సతీష్, అంకేశ్వరపు నగేష్, రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటకు మొగి, కాండం తొలుచు పురుగులతో పాటు ఆకు కత్తిరించే పురుగు (కత్తెర పురుగు) ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.అధికారులు మాట్లాడుతూ కత్తెర పురుగు కారణంగా పంట తీవ్రంగా దెబ్బతింటుందని, దీనిని నివారించడానికి రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. పురుగు మందులతో పాటు సమగ్ర యాజమాన్య పద్ధతులను కూడా పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. పురుగుమందులకు కూడా లొంగని పరిస్థితి ఏర్పడుతున్న నేపథ్యంలో, మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తనం నాటిన రెండు వారాల తర్వాత, ఒక లీటరు వేపనూనెను 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై, మరియు నేల మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. దీనివల్ల గుడ్ల నుంచి పురుగులు రాకుండా నివారించవచ్చు. విత్తనం నాటిన 15-20 రోజుల వ్యవధిలో 250 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్, ఒక లీటరు వేపనూనె, 200 లీటర్ల నీటి మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. 20 నుండి 30 రోజుల మధ్యలో ఎకరానికి 100 గ్రాముల ఇమామెక్టిన్ బెంజెయట్, ఒక లీటరు వేపనూనెను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ విధంగా మందులను మార్చి మార్చి వాడటం వల్ల మొక్కజొన్నను కత్తెర పురుగు నుంచి కాపాడుకోవచ్చని అధికారులు రైతులకు వివరించారు.

## తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్ పీపీ యూనిట్‌లో ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంజీఎం హాస్పిటల్ (పీపీ యూనిట్) వైద్యురాలు డాక్టర్ మెరుగు యశస్విని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్విని మాట్లాడుతూ ప్రతి శిశువు పుట్టిన గంటలోపు తల్లి నుంచి వచ్చే పసుపు రంగులోని ముర్రిపాలు (కొలొస్ట్రమ్) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ఈ ముర్రిపాలు మొదటి టీకాగా పనిచేసి, శిశువులో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ఆమె తెలిపారు. అలాగే, తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకు మధ్య అనుబంధం మరింత బలపడుతుందని చెప్పారు. అంతేకాకుండా, తల్లికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా తగ్గుతాయని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నర్మద, ఏఎన్‌ఎంలు ప్రేమలత, సులోచన, కోమల, లక్ష్మీబాయి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బాబా మందిరంలో ఏసీపీ పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు కూడా ఎంతో అభినందనీయమని హనుమకొండ ఏసీపీ నరసింహారావు అన్నారు. గురువారం నాడు ఆయన సాయిబాబా దర్శనానికి వచ్చిన సందర్భంగా స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మొబైల్ వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ సిద్ధార్థ, వారి సిబ్బందిని అభినందించారు. మందిరం వద్దకు విచ్చేసిన ఏసీపీ నరసింహారావుకు ఆలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పూజారులు మణిశర్మ, చందు ప్రత్యేక పూజలు నిర్వహించి, వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. చైర్మన్ హరగోపాల్ బాబా శేష వస్త్రాలతో ఏసీపీని ఘనంగా సత్కరించారు. మందిరంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి వీఆర్వో నిమ్మల శ్రీనివాస్ ఏసీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సుబేదారి సీఐ రంజిత్ కుమార్, మందిర సిబ్బంది సాయికృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కళాకారులకు సన్మానం



**వరంగల్ వాయిస్, జనగామ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో గురువారం చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. స్థానిక వీవర్స్ కాలనీలో క్లబ్ అధ్యక్షుడు లయన్ బండ భిక్షపతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్వ రీజియన్ చైర్మన్ లయన్ ఏనుగు నర్సిరెడ్డి మాట్లాడుతూ, చేనేత పరిశ్రమ భారతీయ సంస్కృతిలో ఒక అంతర్భాగమని, ఇది హస్తకళల జీవన సౌందర్యానికి ప్రతీక అని అన్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారికి అండగా నిలబడాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా మాచర్ల యాదగిరి, కాల్వ భూపతి, ఆడెపు సునీతలను సన్మానించారు. పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరామ్ శ్రీనివాస్, బొంతపల్లి నాగరాజు సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి దాసరి సుమన్, స్థానికులు బొల్లం రాజు, భీమనాదం హరీష్, బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రక్షాబంధన్ వేడుకలు

**వరంగల్ వాయిస్, జనగామ :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో రక్షాబంధన్ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను చాటి చెప్పడంతో పాటు, సమాజం పట్ల, ధర్మం పట్ల తమ బాధ్యతలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, పురుషులకు రాఖీలు కట్టారు. సామూహికంగా మంగళహారతులు పట్టిన తర్వాత, అందరూ మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం 'నేను మీకు రక్ష, మీరు నాకు రక్ష, మనందరం దేశానికి, ధర్మానికి, సమాజానికి రక్షణగా నిలుద్దాం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ సమాజాన్ని ఒక కుటుంబంగా భావించి ప్రతి స్త్రీలోనూ మాతృమూర్తిని, సోదరిని చూడాలని పిలుపునిచ్చారు. దీనివల్ల పరస్పర అనుబంధం పెరుగుతుందని, విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. లవ్ జిహాద్ వంటి కుట్రల నుండి ఆడపడుచులను కాపాడుకోవాలని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. యువత మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని,



ఈ మార్పు గుడి, బడి నుండే మొదలవ్వాలని, అందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గా వాహిని కన్వీనర్ బొల్లు ఝాన్సీ, విశ్వహిందూ పరిషత్ మాతృ మండలి సభ్యులు గజ్జెల అలివేలు, జక్కా జ్యోతి, ఇందిర, మంజుల, కవిత, సుజాత, శ్రీవాణి తదితర మహిళలతో పాటు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, బచ్చు బాలనారాయణ, కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, యెలసాని రాంబాబు, పట్టణ అధ్యక్షులు అంబటి బాలరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ వేద పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో గురువారం ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే విద్యార్థులకు బంధాలు, బంధుత్వాల పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రేమ, అనురాగం, బాధ్యత వంటివి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేద, ప్రియాంక, కీర్తి రెడ్డి, సౌందర్య, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నడికూడలో..



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగాలకు ప్రతీకగా ఈ రాఖీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని సోదరభావాన్ని పెంపొందించుకున్నారు. పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ఉమా, ఆదిలక్ష్మి, పద్మ, కవిత తదితరులు ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులకు ఆత్మీయంగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పబ్బ సరిత, ప్రధానోపాధ్యాయులు పుల్యాల సంపత్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్, ఉమా, పద్మ, ఆదిలక్ష్మి, ప్రదీప్, రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, సూరమ్మ పాల్గొన్నారు.

## ఆదర్శ మోడల్ పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు గురువారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గణపురం గ్రామానికి చెందిన యోగ గురువు కుమార్, కండే రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు రక్షాబంధన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. నేటి సమాజంలో విద్యార్థులు ఏ విధంగా నడుచుకోవాలో దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిన్నారి ఆద్యను ఆశీర్వదించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మడికొండలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి మనువరాలు నామిరెడ్డి ఆద్య సారీ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు, బంధువులు, స్నేహితులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ వేడుకలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి, రాజారామ్మోహన్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొని చిన్నారి ఆద్యకు ఆశీస్సులు అందించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఉల్లాసభరితంగా సాగింది.

## చేనేత కార్మికుడు బైరి రమేష్‌కు సన్మానం

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపూర్ మండలం, కమలాపూర్ గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు బైరి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో జరిగిన ఈ వేడుకకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చేనేత కార్మికులను సన్మానించిన అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడానికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన రమేష్‌ను శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దిడ్డి రమేష్, కేదాశి వెంకటేశ్వర్లు, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కందికట్ల ప్రశాంత్, ఉపాధ్యక్షులు వెంగళ వేణుగోపాల్, పద్మశాలి కులస్తులు, ఇతర చేనేత కార్మికులు పాల్గొన్నారు.



## బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలి

### చేనేత కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీని పద్మశాలీలు ఆదర్శంగా తీసుకుని ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సహకార సంఘం భవనంలో జరిగిన చేనేత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. శాయంపేట మండలంలో పద్మశాలీలు ఎక్కువగా ఉన్నారని, ఎలాంటి వర్గాలు లేకుండా ఐక్యంగా ఉండి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర కోరారు. ఈ సందర్భంగా ఆయన చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల పద్మశాలి అధ్యక్షుడు వంగరి సాంబయ్య, జిల్లా నాయకులు దిడ్డి రమేష్, భాషా శాంతా రవి, బాసన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

■ డాక్టర్ మేడారపు సుధాకర్

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పాలకుర్తి పట్టణంలో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్ మాట్లాడుతూ, పద్మశాలి, చేనేత కార్మికులు తమ శ్రమకు తగిన ఆదాయం లేకపోయినా చేనేత పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఆదుకుని, వడ్డీలేని రుణాలు,ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే, చేనేత కార్మికులకు విధిస్తున్న జియో ట్యాగ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, జనగామ జిల్లా పోపా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య మాట్లాడుతూ, చేనేతలకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిరుపేద చేనేత కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాచర్ల సారయ్య, తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కూరపాటి సుదర్శన్, మండల పూర్వ అధ్యక్షుడు దేవసాని కృపాకర్,




తొర్రూరు గ్రామ పూర్వ ఎంపీటీసీ చిదిరాల ధనుంజయ, మండల బీజేపీ కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్, పెనుగొండ కిష్టయ్య, చిదురాల మార్కండేయ, చిలుకమారి సోమేశ్వర్, ఉప్పలయ్య, పెనుగొండ వెంకటేశ్వర్లు, కాటబత్తిని సోమన్న, వరప్రసాద్, ఈగ శ్రీను, చిలుకమారి శ్రీధర్, కూరపాటి ఉప్పలయ్య, పెనుగొండ సోమనాథం, మండల ఉపాధ్యక్షుడు పోగు చిరంజీవి, చిలుకమారి వెంకటేష్, శ్రీనివాస్, చిలుకమరి సోమనర్సయ్య, కూరపాటి సోమయ్య, చిదురాల జగన్నాథం, కూరపాటి శ్రీనివాస్, రాపోలు గట్టయ్య, రాపోలు రాంబాబు, లక్ష్మణ్, వైట్ల శ్రీహరి, రాజు, చిదురాల వెంకన్న, గూడెల్లి ఉపేందర్, ఎలిగేటి నరేందర్, గూడూరు అధ్యక్షుడు వైట్ల రామ్మూర్తి, ఈరెంటి అధ్యక్షుడు బిర్రు వెంకటేశ్వర్లు, చెన్నూరు అధ్యక్షుడు ఎనగందుల సత్తయ్య, వల్మిడి అధ్యక్షుడు భారత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలు ఇప్పిస్తా

## ◆ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పలివేల్పుల భగత్ సింగ్ నగర్ గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలు ఇప్పించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో స్వయంగా మాట్లాడతానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. గత 17 సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు జాప్యం చేస్తున్నారని ఆయన అన్నారు. గురువారం హనుమకొండలోని హరిత హోటల్‌లో బస చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, కార్యవర్గ సభ్యుడు ఏదునూరి వెంకట్రాజం ఆధ్వర్యంలో కాలనీవాసులు కలిసి తమ సమస్యను వివరించారు. కాలనీవాసుల సమస్యను సావధానంగా విన్న సాంబశివరావు, అన్ని విధాలుగా అర్హులైన వారికి పట్టాలు ఇవ్వడానికి ఎలాంటి ఆటంకాలు లేనప్పుడు, స్థానిక ఎమ్మెల్యేలు కూడా హామీలు ఇచ్చినప్పుడు ఎందుకు జాప్యం జరుగుతుందో తెలుసుకుంటానని అన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోలేదని, వారికి ఈ విషయం తెలిసిందో లేదో కూడా అనుమానమేనని పేర్కొన్నారు. అందుకే తాను స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రాగానే వీలైతే కాలనీవాసుల ప్రతినిధి బృందంతో కలిసి వెళ్తానని, సమస్య పరిష్కారం అయ్యే వరకు వెంటపడతానని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. తమ సమస్య పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చిన కూనంనేని సాంబశివరావుతో పాటు రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్.ఏ. స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టెపాక రవి, మండల సహాయ కార్యదర్శి అలవాల రాజు, మహిళా సమాఖ్య నాయకురాలు జూకంటి పద్మ, నాయకులు వీరలక్ష్మి, కుమార్, మొగిలి, ప్రవర్ధన్, రమాదేవి, కిషన్, శ్రవణ్ కుమార్, నందిని, ప్రశాంత్ తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# పోచమ్మ దేవాలయ రోడ్డును బాగు చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** శ్రావణమాసం సందర్భంగా జరిగే పోచమ్మ బోనాల జాతరకు భక్తులు ఇబ్బందులు పడకుండా పోచమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డును వెంటనే బాగు చేయాలని మాజీ కౌన్సిలర్ పోరండ్ల సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పరకాల మున్సిపాలిటీ వార్డు ఇంఛార్జికి వినతిపత్రం సమర్పించారు. పరకాల పట్టణంలోని మూడవ వార్డులో ఉన్న అతిపెద్ద పోచమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం బోనాల జాతర అత్యంత వైభవంగా జరుగుతుంది. పరకాల పట్టణం మొత్తం నుంచి భక్తులు ఈ దేవాలయానికి వస్తారు. అయితే, భూపాల్‌పల్లి రోడ్డులోని హైవే నుంచి గుడికి వెళ్లే దారి సరిగా లేకపోవడం వల్ల వాహనదారులు, కాలినడకన వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పోరండ్ల సంతోష్ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి, గుడికి వెళ్లే దారికి సీసీ ర్యాంప్ వేయాలని ఆయన కోరారు. అంతేకాకుండా, బోనాల జాతర ఎన్ని రోజులు జరుగుతుందో అన్ని రోజులు పారిశుద్ధ్యం, లైటింగ్ వంటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన మున్సిపాలిటీ అధికారులను కోరారు.

# నానో యూరియా వాడకంతో రైతులకు లాభాలు

## జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా ఉరుగొండ గ్రామంలో నానో యూరియాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నానో యూరియా వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సాంప్రదాయ యూరియాను మొక్కలు కేవలం 30% మాత్రమే గ్రహిస్తే, నానో యూరియాను 80–90% వరకు శోషించుకుంటాయని ఆయన తెలిపారు. ఒక లీటర్ నానో యూరియా, 45 కిలోల సాంప్రదాయ యూరియాకు సమానంగా పనిచేస్తుంది. దీనివల్ల రైతులు ఎరువుల ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చు.నానో యూరియా మితంగా వాడటం వల్ల నేల, నీటి కాలుష్యం తగ్గుతుంది. అలాగే గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. ఇది 500 మిల్లీలీటర్ల సీసాలో లభిస్తుంది కాబట్టి, తక్కువ స్థలంలో ఎక్కువ స్టాక్‌ను నిల్వ చేసుకోవచ్చు. నానో యూరియా ద్వారా మొక్కలకు తగినంత నత్రజని లభించి, వాటి వృద్ధి మెరుగుపడుతుంది. ఫలితంగా దిగుబడి కూడా పెరుగుతుంది.అధికారులు నానో యూరియా సాంకేతికతను స్వీకరించి, శాస్త్రీయంగా పంటలలో వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ కార్యాలయ టెక్నికల్ ఏఓ కమలాకర్, దామెర ఏఓ అల్లే రాకేష్, ఉరుగొండ ఏఈఓ అరుణ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** వర్షాకాలంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నడికూడ మండల ఎంపీడీవో జి.విమల సూచించారు. గురువారం నాడు ఆమె మండలంలోని ధర్మారం, నర్సక్కపల్లి గ్రామాలను ప్రత్యేక అధికారి బి. నవీన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామాలు శుభ్రంగా, దోమల రహితంగా, ఆరోగ్యంగా ఉండేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం, ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్ధిదారుల పరిస్థితి, పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బీమా అందజేత



**వరంగల్ వాయిస్, చిట్యాల :** పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకున్న ఒక వ్యక్తి అకాల మరణం తర్వాత, అతని కుటుంబానికి బీమా మొత్తాన్ని అందజేసి పోస్టల్ శాఖ భరోసా కల్పించింది. ఈ సంఘటన చిట్యాల మండలంలోని అందుకుతండ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అజ్మీర రమేష్ చిట్యాల పోస్ట్ ఆఫీసులో రూ. 2 లక్షల విలువైన గ్రామీణ తపాలా జీవిత బీమాను తీసుకున్నారు. దీనికిగాను ఆయన నెలవారీ ప్రీమియం రూ. 1,720/– చెల్లించారు. దురదృష్టవశాత్తు, 11 నెలల ప్రీమియం చెల్లించిన తర్వాత ఆయన మరణించారు. రమేష్ మరణానంతరం, ఆయన కుటుంబం బీమాను క్లెయిమ్ చేయగా, పాలసీ మొత్తం రూ. 2,09,600/–ను ఆయన భార్య అజ్మీర శ్రీలతకు అందజేశారు. హనుమకొండ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ వి. హనుమంతు స్వయంగా లబ్ధిదారురాలికి ఈ మొత్తాన్ని అందజేసి, ఆమెకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ హనుమంతు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ జీవిత బీమాను కలిగి ఉండాలని సూచించారు. తపాలా శాఖలో అతి తక్కువ ప్రీమియంతో, ఎక్కువ బోనస్‌తో కూడిన పాలసీలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబానికి ఆర్థిక భరోసా అందించాలని కోరారు.

# కాంగ్రెస్ నేతలు అవినీతి చక్రవర్తులు

## ● త్వరలో చిట్టా విప్పుతాం: వై.కుమార్ గౌడ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల చిట్టాను త్వరలో ప్రజల ముందు ఉంచుతామని స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్ అన్నారు. గురువారం రఘునాథపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో జరిగినంత అవినీతి మరెక్కడా జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలు, అవినీతికి పాల్పడుతూ, తమ మాట వినని అధికారులను ఎమ్మెల్యేకు చెబుతామని బెదిరిస్తున్నారని కుమార్ గౌడ్ విమర్శించారు. గతంలో తహసీల్దార్‌ను తమ పనుల కోసం వాడుకుని, చివరికి ఆయన బదిలీకి కారణమయ్యారని ఆరోపించారు. ప్రతి పనికి డబ్బులు తీసుకుంటూనే పనులు చేస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్లను పేదలకు ఇవ్వకుండా డబ్బులు తీసుకొని అనర్హులకు ఇచ్చారని ఆయన అన్నారు. ఒక ప్రజాప్రతినిధి, మాజీ ప్రజాప్రతినిధి ఇష్టారాజ్యంగా రాజకీయాలు చేస్తూ భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని అన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడం కడియం శ్రీహరికి అలవాటేనని, గతంలో టీడీపీలో ఉన్నప్పుడు ఎన్టీఆర్‌ను, టీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కేసీఆర్‌ను వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. కడియం శ్రీహరిని ప్రజలు ఊసరవెల్లి అని తరిమికొడతారని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి పదవులు పొంది పేదలను, కాంగ్రెస్ కార్యకర్తలను అన్యాయం చేస్తున్నారని కుమార్ గౌడ్ విమర్శించారు. బీసీల మీద ప్రేమ ఉన్నట్లు నటిస్తూ రెడ్డి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నారని, తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసు అధికారులను తమ మాట వినకపోతే బదిలీ చేస్తామని బెదిరిస్తున్నారని కుమార్ గౌడ్ తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి చెబితేనే పనిచేస్తామని అధికారులు అంటుండటం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. కడియం శ్రీహరి అనుచరులు జాగ్రత్తగా ఉండకపోతే ప్రజలు తరిమికొడతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ కన్వీనర్ ముసిపట్ల విజయ్, జిల్లా నాయకులు గూడ కిరణ్ కుమార్, కుర్ర రాజేందర్ నాయక్, దుబ్బాక హరీష్ గౌడ్, పరశురాం గౌడ్, ముప్పిడి సాంబ, దుబ్బాక నర్సింలుతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బందెల దామోదర్ (55) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం పలువురు నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి దామోదర్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. దామోదర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మల్హర్రావు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు భోగం కమల, రంజాన్ అలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, సమన్వయ కమిటీ సభ్యుడు పాడి ప్రతాపరెడ్డి, నీరటి రాములు, బందెల స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వారాహి హోటల్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని కుమార్ పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి ఏసీ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మి కుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వారాహి హోటల్ నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ రెస్టారెంట్‌లో ఏసీ మల్టీ క్యూసిన్, ఫ్యామిలీ రెస్టారెంట్, బ్యాంక్వెట్ హాల్స్, బోర్డు రూమ్స్, కాన్ఫరెన్స్ హాల్స్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, కేటరింగ్ సేవలను కూడా అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హోటల్ చైర్మన్ సుమన్, బీజేపీ నాయకుడు బైరి శ్రవణ్, ఎర్రోజు సారిక తదితరులు పాల్గొన్నారు.

# 11న మహా పాదయాత్ర



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించి, తమను నిర్లక్ష్యం చేస్తోందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల యోగక్షేమాలను పట్టించుకోవడం లేదని, దీనివల్ల ఉద్యమకారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 11న మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మరియు నెలకు రూ. 25,000 పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గణేష్ గుర్తు చేశారు. ఈ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయడానికి ఇప్పటికే పలుమార్లు మెమొరాండాలు సమర్పించామని, నిరసన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అయినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో, మరింత బలంగా పోరాడాలని నిర్ణయించుకున్నామని అన్నారు. ఆగస్టు 11న నిర్వహించే ఈ మహా పాదయాత్ర హనుమకొండలోని వేయి స్తంభాల గుడి నుంచి ఏకశిలా పార్క్ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రలో తెలంగాణ ఉద్యమకారులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని, హక్కుల కోసం సమైక్యంగా పోరాడాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పిలుపునిచ్చింది.

# జమునా దేవికి సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మామునూరు క్యాంపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరంగల్, ఖిలా వరంగల్ మండలాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 69వ పాఠశాలల క్రీడా సమాఖ్య వరంగల్ జోన్ క్రీడల కార్యదర్శిగా మాదన జమునా దేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమె ప్రస్తుతం లక్ష్మీపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్నికైన సందర్భంగా గురువారం లక్ష్మీపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జమునా దేవి భవిష్యత్తులో కూడా ఇలాంటి పదవులు స్వీకరించి విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ చూపడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బక్కి వీర సాయి ప్రసాద్, గులాబ్ సింగ్, మధుకర్, రాజ్యలక్ష్మి, శారద, జ్యోతి, రవికుమార్, శ్రీవాణి, పాషా తదితరులు పాల్గొని జమునాదేవిని సన్మానించారు. విద్యార్థులు కూడా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# అమెరికా వాణిజ్య దురాక్రమణను ఖండించాలి

## ◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రష్యాతో చమురు వాణిజ్యం చేస్తున్నందుకు ప్రతీకారంగా భారత్‌పై 50 శాతం సుంకాలు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. అమెరికా చేస్తున్న ఈ వాణిజ్య దురాక్రమణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, భారతదేశ స్వయంప్రతిపత్తిపై జరుగుతున్న దాడిని నిరసించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ ఒక్క దేశం నాయకత్వానికీ లొంగిపోవాల్సిన అవసరం లేదని, ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ లాంటి వారి అస్తవ్యస్తమైన, శత్రుత్వ విధానాలకు తలొగ్గకూడదని అన్నారు. ఈ సుంకాల పెంపు అమెరికా నేతృత్వంలోని ప్రపంచ క్రమాన్ని బలవంతంగా అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నమేనని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు స్వతంత్ర దేశాలను లొంగదీసుకోవడానికి, సార్వభౌమ విదేశీ, ఆర్థిక విధానాలను అనుసరించే హక్కును బలహీనపరచడానికి ఉద్దేశించబడ్డాయని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రపంచ పరిణామాలు బహుళ ధ్రువత్వం పెరుగుదలను, అభివృద్ధి చెందుతున్న దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని శ్రీనివాసరావు తెలిపారు. ఈ వాస్తవాన్ని అంగీకరించకుండా, అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగించుకోవడానికి బెదిరింపులు, వాణిజ్య దురాక్రమణను ఆశ్రయిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో భారతదేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని గట్టిగా నొక్కి చెప్పాలని, ఆర్థికంగా లేదా రాజకీయంగా ఎలాంటి బాహ్య ఆదేశాలను తిరస్కరించాలని ఆయన సూచించారు. క్వాడ్ వంటి ఒప్పందాల ద్వారా అమెరికా వైపు భారత విదేశాంగ విధానం మొగ్గు చూపడం స్వల్పదృష్టితో కూడిన, ప్రమాదకరమైన చర్య అని ఆయన హెచ్చరించారు. అస్థిరమైన, కేవలం తమ స్వార్థం కోసం పనిచేసే యునైటెడ్ స్టేట్స్‌ను నమ్మదగిన భాగస్వామిగా విశ్వసించలేమని స్పష్టం చేశారు. భారతదేశం తన ప్రాధాన్యతలను తిరిగి సమీక్షించుకొని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని, ప్రజాస్వామ్య, బహుళ ధ్రువ ప్రపంచ క్రమాన్ని నిర్మించడానికి కృషి చేయాలని సూచించారు.

# క్రీడల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి




**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం జావెలిన్ డే, కిడ్స్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగాలలో 2 శాతం రిజర్వేషన్లు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆటల్లో పాల్గొని శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. జనగామ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి బైరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, క్రీడల నిర్వహణ కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, జనగామ జిల్లా అదర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, కోశాధికారి ఆవుల అశోక్, నిర్వహణ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కిరణ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సుగుణాకర్, హనుమంతరావు, గజ్జెల్లి రాజు, కిష్టయ్య, గౌర్సింగ్, ఆడెపు శ్రీనివాసు, పాండ్యా, నాగరాజు, కొర్దూస్, దిలీప్, ముజీబ్ పాల్గొన్నారు.

# అవయవ దానం మహాదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అనారోగ్యంతో మృతి చెందిన చిర్ర సాయిలు గౌడ్ కుటుంబం సమాజ హితం కోరి నేత్రదానం చేసి మానవత్వాన్ని చాటుకుంది. ఈ గొప్ప నిర్ణయాన్ని గౌరవిస్తూ, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వారి కుటుంబ సభ్యులకు సత్కారం నిర్వహించారు. వరంగల్ అర్బన్ ఒకటో వార్డు, ముచ్చర్ల గ్రామానికి చెందిన చిర్ర సాయిలు గౌడ్ (65) జులై 28న మరణించారు. ఆయన మరణానంతరం, కుటుంబ సభ్యులైన భార్య సమ్మక్క, కుమారులు రాజు గౌడ్, చిరంజీవి గౌడ్ దుఃఖంలో ఉన్నప్పటికీ నేత్రదానం చేయడానికి అంగీకరించారు. అదే రోజు ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది కార్నియాను సేకరించారు. గురువారం సాయిలు గౌడ్ ఇంటి వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో అసోసియేషన్ ప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి, అభినందన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ముఖ్య సలహాదారు ఇంజినీర్ రవీందర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు కొన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్, సాయిరెడ్డి, సంధ్య, కోటేశ్వర్ గౌడ్, సుజాత, స్వప్న, ఇతర బంధుమిత్రులు, గ్రామ ప్రజలు, కళాకారులు పాల్గొన్నారు. నేత్ర, శరీర దానం వివరాల కోసం 8790548706, 9490133650 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

# ప్రభుత్వ సేవలు పారదర్శకంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని ఇనుగుర్తి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, ఫర్టిలైజర్ షాప్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా ఉన్నతాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సత్వరమైన, పారదర్శకమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలో భాగంగా ఆయన మాట్లాడుతూ, సబ్ సెంటర్ల వారీగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహించాలని, వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య నివేదికలు సిద్ధం చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాతాశిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రానున్న రోజుల్లో నిర్వహించే నూలు పురుగు దినోత్సవం, బోదకాలు నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. మందుల స్టాక్ వివరాలను, సిబ్బంది హాజరు పట్టికను కూడా ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసి, భూభారతి ఫైళ్లు, ఇందిరమ్మ ఇండ్ల ఫైళ్లు నిర్వహణను పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని, ప్రభుత్వం సూచించిన ప్రకారం సేవలు అందించాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని కిషన్ నాయక్ అగ్రి మాల్‌ను తనిఖీ చేసి, విత్తనాలు, ఎరువులు, మందులు స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని, రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్ ద్వారానే అమ్మకాలు జరపాలని ఆదేశించారు. కల్తీ ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, రుచికరమైన వేడి ఆహారాన్ని అందించాలని సూచించారు. భోజనం సిద్ధం చేసే సిబ్బంది శుభ్రత పాటించాలని చెప్పారు. విద్యార్థినులకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య, మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైతే మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభాస్ స్పిరిట్ కోసం ఆఫర్
## నటించాలనుకునే యువతకు ఛాన్స్

అగ్ర కథానాయకుడు ప్రభాస్, దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. 'స్పిరిట్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్ తో రాబోతుండగా.. ఈ మూవీని టీ– సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం సెప్టెంబర్ చివరిలో షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను వెల్లడిరచింది చిత్రబృందం. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు ఆసక్తి ఉన్న వారిని డిజిటల్ ఆడిషన్స్‌కి పిలుస్తుంది చిత్రయూనిట్. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసింది భద్రకాళీ పిక్చర్స్. ప్రభాస్ స్పిరిట్ సినిమాలో నటించేందుకు 13 నుంచి 17 ఏండ్ల వయసున్న పురుష నటులను ఆడిషన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపింది. అయితే ఆడిషన్స్‌లో పాల్గొనేవారు పాత్ర కోసం తమ జుట్టు– కత్తిరించుకోవడానికి కూడా సిద్ధంగా ఉండాలని తెలిపింది. అలాగే ఒక హెడ్ షాట్ ఫోటోతో పాటు– పర్సనల్ షాట్ ఫోటో కూడా జత చేయాలని కోరారు. ఇక ఇంట్రడక్షన్ వీడియోలో మీ పేరు ఇతర వివరాలు వెల్లడిరచడంతోపాటు మీ చదువుకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడిరచాలని కోరారు.



### యువహీరో ధ్రువ్ విక్రమ్‌తో మూవీ

ప్రముఖ దర్శకుడు మణిరత్నం పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది హృదయాలను తాకే అందమైన ప్రేమ కథలు. అయితే ఇటీవల ఆయన దర్శకత్వంలో వచ్చిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమా ఫలితంగా కొంత నిరాశకు లోనైన మణిరత్నం, తన ఫేవరెట్ జోనర్ అయిన లవ్ డ్రామా వైపు మళ్లీ రీటర్న్ అవ్వడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఆయన కొత్తగా తెరకెక్కించబోయే చిత్రంలో తమిళ యువ హీరో ధ్రువ్ విక్రమ్, కన్నడ బ్యూటీ– రుక్మిణి వసంత్ హీరో హీరోయిన్లుగా నటించనున్నారు. తొలిసారి స్క్రీన్ పై కలసి నటించనున్న ఈ జంట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని భావిస్తున్నారు.ప్రేమ, కుటుంబ సంబంధాలు, వ్యక్తిగత సంఘర్షణలు అన్నీ కలగలిపిన ఒక భావోద్వేగ భరితమైన కథతో మణిరత్నం ఈ సినిమాను రూపొందించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు ఎ□`లాన్ చేస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం అందించనున్న ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ మరో స్పెషల్ అట్రాక్షన్ కానుంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. మణిరత్నం గత సినిమాలకన్నా పూర్తి భిన్నంగా, కొత్త ఎనర్జీతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారని తెలిసింది. కథలోని పాత్రలు, వారి మధ్య ఉన్న బంధాలు ప్రేక్షకులకు కొత్తగా అనిపించేలా మణిరత్నం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఫిలింనగర్ వర్గాలు చెబుతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత మణిరత్నం మళ్లీ ఓ క్లాస్ లవ్ స్టోరీతో వెండితెరపై సందడి చేయబోతుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.



## మణిరత్నం మరో లవ్‌స్టోరీ

### హీరోయిన్‌గా, డ్యాన్సర్‌గా డ్యూయల్ రోల్

శ్రీలీల ఉంటే ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్స్ కోసం మరో భామను వెతకాల్సిన పని లేదు. ఎందుకంటే హీరోయిన్ రోల్‌కే కాదు ఐటమ్ నెంబర్‌కు ఫర్ ఫెక్ట్ ఛాయిస్‌గా మారిపోయింది. డ్యూయెట్ సాంగైనా, ఊర మాస్ పాటైనా మేడమ్ రచ్చ రంబోలా చేయాల్సిందే. స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లకు నిర్మాతలు కోట్లు వెచ్చించి తెచ్చుకునే ఛాన్స్ లేకుండా కిసిక్ బ్యూటీ డ్యూయల్ రోల్ పోషించేస్తోంది. ధమాకాలో పల్సర్ బైక్, జింతాకా అంటూ మాసీ స్టెప్పులు మొదలెట్టిన దగ్గర నుండి డ్యాన్సింగ్ క్వీన్‌గా ముద్రపడిపోయింది శ్రీలీల. ఫీమేల్ లీడ్‌గా నటిస్తే మాస్ సాంగ్ కంపల్సరీ. ఇక ఐటమ్ నంబర్ కోసం మరో భామకు తెచ్చుకోనక్కర్లేదు. ఏ టు– జెడ్ ఫెర్మామెన్స్ ఇచ్చేస్తుంది కిస్సిక్ బ్యూటీ–. యూట్యూబ్‌ను షేక్ చేయాలంటే మిస్ లీల ఉంటే చాలనేంతలా ప్రొడ్యూసర్ల మైండ్లలో ఫిక్స్ అయ్యేలా చేసింది. సినిమాపై హైప్ రావాలా, అ–టె–న్షన్ కావాలా వైరల్ వయ్యారీతో డ్యాన్స్ చేస్తే పోలా అని భావిస్తున్నారు. గుంటూరు కారంలో కుర్చీ మడత పెట్టినా, జూనియర్‌లో వైరల్ వయ్యారీగా మారినా తాను హీరోయిన్ కాని పుష్ప2లో కూడా కిస్సిక్ బ్యూటీ–గా ర్యాంపేజ్ గ్లామర్ షోతో మాస్ మహారాణిగా మారిపోయింది. ఇటు– హీరోయిన్‌గా, ఇటు– ఐటమ్ గర్ల్ గా మూవీకి వన్ ఉమెన్ షోగా మేకోవరైంది శ్రీలీల. అంటే నిర్మాతలకు డబుల్ బోనాంజాలా మారిన మేడమ్.. నెక్ట్స్ రవితేజ మూవీ మాస్ జాతరలోనూ అటు– క్లాసీ లుక్, ఇటు– మాసీ సాంగ్స్‌లో గత్తర లేపడానికి రెడీ అయ్యింది. మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్ దగ్గర ధమాకా హిట్ నమోదు చేస్తుందా ఎ□`లాపుల్లో ఉన్న రవితేజ, శ్రీలీలకు కంబ్యాక్ మూవీగా మారుతుందో లేదో చూడాలి.

## శ్రీలీలతో నిర్మాతలకు భరోసా



# విడాకుల ర్యూమర్స్‌ను
# తోసిపుచ్చిన సంగీత



సీనియర్ నటి సంగీత, ఆమె భర్త, సింగర్ క్రిష్ విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో ఇటీవల వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ వార్తలపై నటి సంగీత స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. ఈ సందర్భంగా తన భర్త క్రిష్‌తో కలిసి దిగిన ఒక ఫొటోను సోషల్ మీడియా వేదిక పంచుకుంది. గతంలో సంగీత తన ఇన్‌స్టాగ్రామ్ బయోలో సంగీత క్రిష్ అని ఉన్న పేరును సంగీతగా మార్చడంతో వీరిద్దరూ విడిపోతున్నట్లు– పుకార్లు మొదలయ్యాయి. అయితే ఈ పుకార్లకు చెక్ పెడుతూ మేము బాగానే ఉన్నట్లు– సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. సినిమాల విషయానికి వస్తే.. ఆచర్య, మసూద, వారసుడు తదితర చిత్రాలతో ఇటీ–వల ప్రేక్షకులను అలరించింది ఈ భామ.

# చేనేతను ఆదరించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మార్కెట్ లో డిమాండ్ కు అనుగుణంగా చేనేత ఉత్పత్తులను తీసుకురావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నేతన్నలకు సూచించారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో కాళోజీ సెంటర్ నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు చేనేత నడక ( హ్యాండ్లూమ్ వాక్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో 800 మంది నేత కార్మికులు ఉన్నారన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. చేనేత కార్మికులకు రుణమాఫీ కూడా ప్రభుత్వం చేసిందన్నారు. చేనేత కార్మికులు తయారు చేస్తున్న బెడ్ షీట్స్, టవల్స్, ఇతరత్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇంకా ఏవైనా ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఇతర సంస్థలు స్కూల్స్, గురుకులాలు, హాస్పిటల్స్ ఉన్నాయి కాబట్టి వాటికి కూడా డైరెక్ట్ గా చేనేత ద్వారా అందించే వీలు ఉందా అనేది ఆలోచిస్తామన్నారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకాలకు సంబంధించిన టెస్కో స్టాల్స్ ను నెలకోసారి ఐడీఓసీలో పెట్టాలన్నారు. జిల్లాలో చేనేత ఉత్పత్తులు తయారవుతున్నాయని అందరికీ తెలియజెప్పేందుకు స్టాల్స్ ఏర్పాటు ముఖ్యమన్నారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి దాదాపుగా 500 మంది వరకు ప్రజలు కలెక్టరేట్ కు వస్తుంటారని, జిల్లాలో చేనేత ఉత్పత్తులు తయారవుతున్న విషయం వారికి కూడా తెలియాలన్నారు. మార్కెట్ లో వేటికి మంచి ఆదరణ ఉందో వాటిని చేనేతలు ఉత్పత్తి చేయాలని సూచించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించే విధంగా స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా చేనేత సంబంధించిన వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యతను ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. చేనేతపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

### నులిపురుగుల నిర్మూలన తప్పనిసరి..

నులిపురుగుల నిర్మూలన కోసం 1 నుంచి 19 సంవత్సరాలలోపు వారందరికీ ఈ నెల 11 న ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంపై డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, డీఆర్డీఓ మేన శ్రీను, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సోషల్ వెల్ఫేర్ డీడీ నిర్మల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళా, జిల్లా పంచాయత్ అధికారి లక్ష్మి రమాకాంత్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి గౌస్ హైదర్, పీడియాట్రిక్ అసోసియేషన్ నుంచి డాక్టర్ నవీన్, డెమో అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



# నిజమైన అందాన్నిచ్చేది చేనేత వస్త్రాలే

- లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్
- ఓరుగల్లులో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తవాడ గోపాలస్వామి గుడి జంక్షన్ సెంటర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 20 మంది చేనేత కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఆడెపు రవీందర్ నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపారు. నిండైన భారతీయతకు నిజమైన అందాన్నిచ్చే చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు ప్రోత్సాహాన్ని అందిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, గౌరవ అధ్యక్షులు కుసుమ సతీష్, సెక్రటరీ గోరంట్ల రాజు, రాష్ట్ర నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, బేతి అశోక్, భాసాని శ్రీనివాస్, కూరపాటి సంపత్, మాసబత్తుల కుమార్, వలస సుధాకర్, కూచన రమేష్, తుమ్మ రమేష్, మదనయ్య, ఆడెపు భిక్షపతి, పిట్ట రాజేంద్రప్రసాద్, డీఎస్ మూర్తి, చేనేత కార్మికులు, కులబాంధవులు పాల్గొన్నారు.

## నర్సింగరావుకు రాష్ట్ర చేనేత అవార్డు

### చేనేత జౌళి శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రధానం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ లోని నక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో గురువారం చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఆధ్యక్షతన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత , గజం గోవర్ధన్, అవ్వారు భాస్కర్, మచ్చ వరలక్ష్మి, అంకం శ్రీనివాస్, మాసన రవికుమార్, కొంగ కరుణశ్రీ పాల్గొని చేనేత కళాకారులకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ మంత్రి




తుమ్మల నాగేశ్వర్ రావు చేతుల మీదుగా వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన కంచ నర్సింగరావు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర చేనేత అవార్డు అందుకున్నారు.



## రేపే డబుల్ బెడ్ రూంల పంపిణీ

- హాజరుకానున్న ఇంచార్జి మంత్రి పొంగులేటి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుపేదల కల నెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డబుల్ బెడ్ రూం పంపిణీకి రంగం సిద్ధమైంది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఇండ్ల పంపిణీ చేపట్టనున్నారు. ఈ మేరకు గురువారం బాలసముద్రంలోని రెండు పడక గదుల ఇండ్ల వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలసముద్రంలోని రెండు పడక గదుల ఇండ్ల పంపిణీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేయాలన్నారు. బ్లాక్ ల వారీగా తాగునీరు, విద్యుత్, శానిటేషన్ సమస్యలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఎల్ఓసీ అందజేత..

**వరంగల్ వాయిస్, చిల్పూరు :** మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నామాల సరిత కొన్ని రోజుల క్రితం అనారోగ్య కారణాలతో హాస్పిటల్ లో చేరారు. కాగా చికిత్స కోసం ఎల్ఓసీ మంజూరు చేయించాలని ఆమె భర్త నామాల రవి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. ఈ మేరకు గురువారం రూ.2.50 లక్షల ఎల్ఓసీని లబ్ధిదారుడికి ఎమ్మెల్యే శ్రీహరి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి రంజిత్ రెడ్డి, నామాల మల్లేష్, పశుల వెంకటేష్, నామాల రవి తదితరులు పాల్గొన్నారు.



## మార్త భద్రయ్యకు ఘన నివాళులు

**వరంగల్ వాయిస్, గీసుకొండ :** గీసుకొండ మండలం ఎలుకుర్తి హవేలీకి చెందిన స్వర్గీయ మార్త భద్రయ్య చిత్రపటానికి గురువారం వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ నివాళులర్పించారు. వారి కుమారులు మార్త రమేశ్ (నిమ్స్ ఆస్పత్రి లైజనింగ్ ఆఫీసర్), మార్త సత్యనారాయణ, మార్త రవికృష్ణలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జయపాల్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com